క్లుప్తంగా

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల ప్రజలు చెత్తను పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఈపురుపాలెం పంచాయతీ కార్యదర్శి మురళీబాపూజీ సూచించారు. మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతాలైన పద్మనాభునిపేట, గాంధీ పార్కు, సీతారాంపేట, నలబై ఇళ్లు, ఇందిరానగర్, భావనారుషిపేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్మూలన చేపట్టారు. ఎండలు విపరీతంగా కాస్తున్నందున తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ ప్రజలకు సూచనలందించారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. నివాస గృహాల నుంచి వచ్చే చెత్తను, మురుగు నీటిని రోడ్లపైకి రాకుండా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే చెత్తను పంచాయతీ సిబ్బందికి అందించడంతో పాటుగా జనవాసాల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రజలు రోడ్లపైకి చెత్త, వ్యర్థాలు వేయకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి వేదిక అని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహశీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు 17 అర్జీలను అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పలు శాఖల ఉద్యోగులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అద్దంకి: మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాలీచాలని జీతంతో కార్మికులు పనిచేస్తున్నారని విద్యార్థులకు ముందుగా పెట్టుబడి పెట్టి వంట చేసి పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. అయితే గత ఆరు నెలల నుచి కార్మికులకు రావాల్సిన వేతనాలు రాలేదని మూడు నెలలు బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్ కోటేశ్వరమ్మ గోవిందమ్మ, సోమయ్య విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వక.. పనులు సాగక !

- మనబడి– మన భవిష్యత్‌కు నిధులు ఏవి ?
- పాఠశాలల్లో ఆగిన భవన నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వేటపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదులు

వేటపాలెం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన పాఠశాలలు నేడు దిక్కులు పిక్కటిల్లేలా గోస పెడుతున్నాయి. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన సంస్కరణలు మొత్తాన్ని నాశనం చేసి పేద పిల్లలను చదువుకు దూరం చేసింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పినే వాటికి నిధులను ఆపేసింది. దీంతో పాఠశాల భవన నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల్లో విద్యా సంస్కరణల్లో భాగంగా నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల భవన నిర్మాణాలకు గాను రెండు విడతలుగా కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి పనులు కొనసాగించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మన బడి నాడు–నేడు కార్యక్రమం పేరును మన బడి–మన భవిష్యత్‌గా మార్చింది. అయితే అభివృద్ధి కార్యక్రమానికి నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఏడాదిగా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలో ఆగిన పాఠశాలల నిర్మాణాలు..

మండలంలో మొత్తం 52 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపుగా 5,800 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు రెండో విడతలో భాగంగా రూ. 6.64 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కొన్ని భవనాల నిర్మణాలు పూర్తయ్యాయి. మరికొన్ని భవనాలు స్లాబ్ దశలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిధులు నిలిపేయడంతో అసంపూర్తిగా మిగిలాయి. దీంతో అదనపు గదులు పూర్తికాక, తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువు కొనసాగించాల్సి వస్తోంది. నాడు–నేడు రెండో దశ కింద పనులు ప్రారంభించి అసంపూర్తిగా నిలిచిపోయిన కొత్తపేట, పందిళ్లపల్లి హైస్కూళ్లలో తరగతి గదులు స్లాబుదశలో నిలిచిపోయాయి. వేటపాలెం దేశాయిపేట హైస్కూల్‌లో తరగతి గదులు లెంటిల్ లెవల్‌లో నిలిచిపోయాయి. మరి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందా లేదా వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిధులు రాగానే పూర్తి చేస్తాం..



మండలంలో పాఠశాలల నూతన భవన నిర్మాణాల పురోగతి గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతం చేస్తాం.

– పురుషోత్తం, ఎంఈఓ–2, వేటపాలెం

యువతపోరుకు తరలిన నిరుద్యోగులు



యువత పోరు నిరసన ధర్నాకు హాజరైన పర్చూరు యువకులు



యువత పోరుకు ర్యాలీగా వెళుతున్న చీరాల నాయకులు

అద్దంకి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అద్దంకి నియోజకవర్గం నుంచి సోమవారం బాపట్లకు యువజనం యువతపోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. వీరంతా నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బొనిగల మధు, కొరిశపాడు మండల యూత్ అధ్యక్షుడు నూకతోటి అశోక్, పార్టీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీ కోయి అంకారావు, వివిధ హోదాల్లో ఉన్న నాయకుల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

ఫీజుపోరుకు తరలిన యువకులు..

కారంచేడు: కూటమి ప్రభుత్వం యువత పట్ల అవలంభిస్తున్న మోసపూరిత అలసత్వ విధానానికి నిరసనగా వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ పిలుపుతో బాపట్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు కారంచేడు మండలం నుంచి పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

మార్టూరు: యువత పోరుకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా బాపట్ల తరలి వెళ్లారు. ఇన్‌చార్జి గాదె మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు.

చీరాల నుంచి పెద్ద ఎత్తున వెళ్లిన నాయకులు, యువత

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ సూచనలతో సోమవారం యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి చీరాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బాపట్ల తరలివెళ్లారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా చీరాల నుంచి బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, చీరాల మండల అధ్యక్షుడు అద్దంకిరెడ్డి, వేటపాలెం మండలం అధ్యక్షులు సాధు రాఘవ, ఉమామహేశ్వరరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బత్తుల అనిల్, కావూరి రమణారెడ్డి, కావూరి బాలకోటిరెడ్డి, కె.రమేష్, చీరాల, వేటపాలెం మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



అద్దంకిలో ఫీజుపోరుకు తరలిన నేతలు

పర్చూరు (చినగంజాం): కూటమి ప్రభుత్వం యువత పట్ల అవలంభిస్తున్న మోసపూరిత అలసత్వ విధానానికి నిరసనగా సోమవారం బాపట్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన ధర్నాకు పర్చూరు నియోజకవర్గం నుంచి పలువురు యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, ఉప్పలపాటి అనిల్, యార్లగడ్డ శ్రీకాంత్, కొల్లా శేషగిరిరావు, ముప్పాళ్ల రాఘవయ్య, కొల్లా శ్రీహరి,చిన్ని పూర్ణారావు, అడపా గంగయ్య, మైలా చిన్ననాగేశ్వరరావు, తమ్మలూరి సురేష్, అట్లూరి వెంకయ్య, అట్లూరి కృష్ణారావు, కాకర్ల రామగోపాల్‌వర్మ, రమావత్ బుజ్జినాయక్, మాచవరపు రవికుమార్,కాటి లక్ష్మణ్, జొన్నలగడ్డ గురవయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు ఆర్థికవృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వెలుగు ఏపీఎం కె.మధుసూదన్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతి నెల 10 తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. ఉన్నతి పథకంలో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం



మండల సమావేశంలో సభ్యుల కోసం ఎదురు చూస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ



సభ్యులు గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

- ప్రగతి నివేదికలకే పరిమితమైన అధికారులు

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు మూడు నెలలకొకసారి జరిగే మండల సమావేశం సభ్యుల గైర్హాజరుతో రెండు గంటలు ఆలస్యమైంది. సమావేశం ప్రారంభించాక 50 నిమిషాలకే ప్రగతి నివేదికలతో మమగా ముగించారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షత మండల సమావేశం జరిగింది. 11 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా ఎంపీపీతోపాటు వేమవరం, ఉప్పుమాగులూరు, గుంటుపల్లి ఎంపీటీసీలు గొట్టిపాటి అలివేలమ్మ, ఒంటరి మరియమ్మ, దూళిపాళ్ల శ్రావణి మాత్రమే హాజరై మినిట్‌లో సంతకాలు చేశారు. మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరు గతేడాది చనిపోయారు. గత ప్రభుత్వం పనులు చేసిన ఎంపీటీసీలకు ఎం బుక్ రికార్డు పూర్తయిన సొమ్ము చెల్లించడంలో జాప్యంతోపాటు, గౌరవ వేతనం చెల్లించనందున ఆహ్వానం పంపినా సభ్యులు గ్రామాల నుంచి మండలానికి రాలేదు. ఒంటి గంటకు కోరం కోసం బల్లికురవ ఎంపీటీసీ తంగిరాల రాహేలును సెక్రటరీని పంపించి తీసుకురావటంతో ఎట్టకేలకు కోరం అయింది. వ్యవసాయ, విద్య, పశువైద్యం, పశు వైద్యం, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూస్, ఐసీడీఎస్ అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ప్రధానమైన విద్యుత్, ఆరోగ్యం, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, ఎన్నెస్పీ అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. గత ప్రభుత్వంలో సోమవరప్పాడు సచివాలయం నిర్మాణంలో భాగంగా నిధులు చాలనందున మండల నిధులు రూ. 8 లక్షలు కేటాయించారని కాంట్రాక్టర్ కె. సాంబయ్య తెలిపారు. ఎం బుక్ రికార్డు కూడా పూర్తయిందని, తనకు బిల్లు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఎంపీడీవో కె. కుసుమకుమారికి వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ చింతల అంజలి, చెన్నుపల్లి, ఎస్ఎల్ గుడిపాడు, కొప్పరపాడు, గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్‌ల భర్తలు సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల కొప్పరపాలెం సర్పంచ్ వల్లంరెడ్డి అమల గుండెపోటుతో మృతి చెందినా కనీసం సమావేశంలో ఆమెకు గుర్తు చేసుకున్న దాఖలాలు లేవు.

రిజిస్ట్రేషన్ యాక్ట్ 2025 వద్దని మంత్రికి వినతి

ఇంకొల్లు(చినగంజాం): రిజిస్ట్రేషన్ యాక్ట్ 2025లోని ప్రజలకు అసౌకర్యం కలిగించగల మూడు అంశాలపై అభ్యంతరాలతో వాటిని రాష్ట్రంలో అమలు చేయకూడదని కోరుతూ ఏపీ డాక్యుమెంట్ రైటర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తాడికొండ ఎలియాజర్ సోమవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. డీవీఆర్ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ సభకు వచ్చిన మంత్రిని ఆయన కలిసి వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం పాత రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేసి రిజిస్ట్రేషన్ యాక్ట్ 2025 ముసాయిదా బిల్లును విడుదల చేసిందన్నారు. ఈ ముసాయిదాపై అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు ఈ నెల 25వ తేదీ లోగా తెలపాలని కోరినట్లు ఆయన మంత్రికి వివరించారు. ముసాయిదాలోని కొన్ని అంశాలు ప్రజల సాధారణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నందున ఆ అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దస్తావేజులను రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ ద్వారా సమర్పించడం అనేది పెద్దలు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానం లేని వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన టెంప్లేట్‌లలోని ఖాళీలను పూరించడం అనే నిబంధన వ్యక్తిగత సమాచారం, స్వేచ్ఛను తగ్గిస్తుందన్నారు. అంతే కాక ప్రస్తుత విధానానికి భిన్నంగా ఉంటుందని, కాగిత రహిత విధానాన్ని అమలు చేయాలన్న ప్రతిపాదన సాంకేతిక లోపాలు, ఇంటర్‌నెట్ సమస్యలు వలన ప్రజలందరికీ అందుబాటులో ఉండదని ఆయన మంత్రికి వివరించారు. అందువలన ఈ మూడు అంశాలను రాష్ట్రంలో అమలు చేయకూడదని ఆయన డిమాండ్ చేశారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలు

జే.పంగులూరు: మండలంలోని బూదవాడ గ్రామంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ సోమవారం ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరనారాయణ మాట్లాడతూ విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, తద్వారా పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందని తెలిపారు. అనంతరం ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రఘురామయ్య, ఉపాధ్యాయులు స్వర్ణ వెంకట దుర్గా వరప్రసాద్, జీవీఆర్కే కిషోర్, ఏ ధనరాజ్, పి శ్రీనివాసరావు, ఐ చంద్రశేఖర్, కే పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దాత వీరనారాయణ

మద్యం బాటిళ్లు స్వాధీనం

జే.పంగులూరు: జోరుగా అక్రమ మద్యం వ్యాపారం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. మండలంలోని రామకూరు గ్రామంలో బెల్ట్ షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి ఎక్సైజ్ ఎస్సై హర్షవర్ధన్ రెడ్డి సోమవారం తెలిపారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న షేక్ ఘూరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు బైటమంజులూరులో దాడులు చేశామని ఎటువంటి అక్రమ మద్యం లభించలేదన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాతలు

చినగంజాం: ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పెదగంజాం గ్రామంలోని వైసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వివేకానంద సేవా సమితి సభ్యులు పావులూరి శివాజీ తాత బాలయ్య జ్ఞాపకార్థం పాఠశాలలోని ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చినగంజాం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, మహేంద్రనాథ్, పాఠశాల హెచ్ఎం పీ చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- నేడు ఇంకొల్లు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు(చినగంజాం): సమస్యలకు పరిష్కారం లభించనప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకుని పలువురు ప్రజానిధులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకొల్లు మేజర్ పంచాయతీ పరిధిలో స్థానికంగా ప్రజలు స్థానిక సమస్యలతో సతమతమవుతుంటే అధికారులు పట్టించుకోక పోవడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇంకొల్లు పంచాయతీ పరిధిలో మురుగు కాలువ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని మూడో వార్డు మెంబర్ ఆలపాటి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల, పంచాయతీల అభివృద్ధిలో డ్రైనేజీల సమస్య ప్రధానమైనది కాగా వాటి కోసం కేటాయించే నిధులు ఏమలుతున్నాయంటూ ఆయనతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని ప్రధాన మురుగు కాలువ అధ్వానంగా ఉందని, మురుగు కాలువకు ఉండాల్సిన గోడలు సైతం శిథిలావస్థకు చేరిందన్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే ఈ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణం, బ్రిడ్జి నిర్మాణం చేయకుంటే ఇంకొల్లు ప్రజలకు తిప్పలు తప్పవని వారు ఆవేదన చెందుతున్నారు. అప్పటి వరకు మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి ప్రయోజనం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీ వ్యవస్థను చూపుతున్న వార్డు సభ్యులు

తహసీల్దార్ కార్యాలయాల ముందు సర్వేయర్ల నిరసన



పంగులూరులో నిరసన తెలియజేస్తున్న సర్వేయర్లు



యద్దనపూడిలో తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

జే పంగులూరు: రాష్ట్రంలోని గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి సర్వేయర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హేతుబద్ధీకరణతో భాగంగా మిగులు సిబ్బంది 4722 మంది సర్వేయర్ల భవిష్యత్ కోసం సమగ్రమైన నివేదికను సమర్పించాలని, గ్రేడ్ 3, గ్రేడ్ 2లుగా హోదా మార్చి, పేస్కేలు తగు మార్పులు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు తిరువీధులు వీరాంజనేయులు, కసిరెడ్డి అనంతారెడ్డి, పోలిశెట్టి చందు, నక్క సుధాకర్, నరేష్, జెల్లీ దీపక, షేక్ నజ్మా తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

యద్దనపూడి: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్వేయర్లు కోరారు. ఈమేరకు తమకు బదిలీలతో పాటు స్పష్టమైన పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దారు రవికుమార్‌కు తమ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

సొంత మండలాల్లో బదిలీలు చేపట్టాలి

బల్లికురవ: చాలీచాలని జీతంతో పనిచేస్తున్న తమను సొంత మండలాల్లోనే బదీలు చేపట్టాలని సచివాయల సర్వేయర్లు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన, ప్లకార్డుతో తహసీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 20 సచివాలయల్లో పనిచేస్తున్న సర్వేయర్లు ప్రమోషన్‌లు ఫస్టు–ట్రాన్స్‌ఫర్ నెక్స్, క్యాడర్ తక్కువ, కొరదాలు ఎక్కువ రికార్డు అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులమైన తమకు గెజిటెడ్ నిబంధనలా అని ప్రశ్నించారు. ఈ జీతంతో పరాయి మండలాల్లో ఎలా జీవించాలి. పిల్లలు వృద్ధులైన తల్లిదండ్రులను వేరే మండలాలకు తీసుకెళ్లి జీవించటమంటే ఆర్థిక భారంతో కూడుకున్న పనేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత మండలాలలకు బదీలు జరిగేలా అవకాశం కల్పించాలని విన్నవించారు.



బల్లికురవలో సర్వేయర్లు ప్లకార్డులతో నిరసన

దీర్ఘకాల సమస్యలు పరిష్కరించండి

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండల కేంద్రంలో దీర్ఘ కాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అన్నంబొట్ల మోహనకృష్ణ సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఇంకొల్లు కేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన మంత్రిని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అర్జీని పరిశీలించి సమస్య పరిష్కారం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, జ్యేష్ఠ మాసం, రోహిణి నక్షత్రం, చతుర్దశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకి సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.